# నేను నేనే-16

**Index** **Page no**


216. సమత్వమే స్థితప్రజ్ఞత 2

217. మిత ఆహారం-మిత వ్యవహారం 6

218. అంతిమ ప్రయోజనం 11

219. శిష్యుడు ఇవ్వాలి, గురువు తీసుకోకూడదు 14

220. శిశువు ఏడుపే, శిశువు బలం 18

221. ఉన్నదానిని ఉన్నట్టుగా చూడడమే దైవదర్శనం 22

222. మెలకువ నుండి మెలకువ 26

223. మరణ జయం-మృత్యురహస్యం 30

224. తానుండడమే దేవుడుండడం, ఆస్తికుడు-నాస్తికుడు 34

225. తనకు హాయి కాదు; తానే హాయి 41

226. సమత్వబుద్ధి-సృష్టే దేవుడు 46

227. దేహాభిమానమే బ్రహ్మానుభవం, 'నేనెవడను' అనే విచారణ చేయవలసింది బ్రహ్మమే, జీవాత్మ కాదు 51

## 216. సమత్వమే స్థితప్రజ్ఞత

ఒకర్ని అజ్ఞాని అనడం ఎంత అవమానించడమో.

ఒకర్ని జ్ఞాని అనడం కూడా అంత అవమానించడమే.

'ప్రత్యేకత' చూపడం జ్ఞానికి నచ్చదు.

'ప్రత్యేకత' చూపకపోవడం జ్ఞానలక్షణం.

ప్రత్యేకత వలనే ప్రపంచానుభవం.

ప్రత్యేకత లేకుంటే ఏకత్వానుభవం.

ప్రత్యేకత ఉంటే ద్వైతం.

ప్రత్యేకత లేకుంటే అద్వైతం.

* * *

ఎవరికీ...దేనికీ...ప్రత్యేకత లేదు...

గురువుకు కూడా...దేవుడికి కూడా...

ప్రత్యేకమైన తేదీ

ప్రత్యేకమైన ప్రదేశం

ప్రత్యేకమైన వస్తువు

ప్రత్యేకమైన వ్యక్తి

నీకు తోస్తున్నంతవఱకు

నీవు పొందవలసినదానిని పొందనట్టే.

ప్రత్యేకత ఉంటే అది ఆధ్యాత్మికం కాదు...

ఈ ఆధ్యాత్మికంలో మనం నేర్వవలసింది...

నీతో సహా దేనికీ ఎవరికీ ప్రత్యేకత ఇవ్వకపోవడం అనేదే...

'సద్గురు' చేరిస్తే అన్ని పేర్లకూ తగిలించు...

లేదంటే ఎవరి పేరుకూ తగిలించకు....

అన్నారు గురుదేవులు.

అప్పుడే సమత్వం సిద్ధించేది.

సమత్వమే స్థితప్రజ్ఞత.

ఓరోజు గురువుగారన్నారు-

"గేట్ బయటున్న గజ్జికుక్క

గేట్ లోపలుండే సద్గురువు

నీకు సమానంగా కనిపించినప్పుడు

నీ కోర్సు పూర్తయినట్టు." అన్నారు.

* * *

రమణులు-

మహారాజులు వచ్చి ప్రక్కనే నిలబడినా...

మునగాకు వలవడం ఆపలేదు...

పీఠాధిపతులు వచ్చి నమస్కరించినా...

కూర్చోమని ఆసనం చూపలేదు...

నారాయణగురు లాంటి ఆధ్యాత్మికవేత్తలు వచ్చినా...

రాధాకృష్ణన్ లాంటి పండితులు వచ్చినా...

తన మౌనం వీడలేదు...

అలా అని వారిని అవమానించడం కాదు...

ప్రత్యేకత ఇవ్వకపోవడం.

అందరి యెడల ఒకే దృష్టి కలిగి ఉండడం.

"ప్రత్యేకత"ను కోల్పోయిన మనసే ఆత్మ.

మనుషులే కాదు, పశుపక్ష్యాదులతో సహా, దేవతలు సైతం...

నీకు నమస్కరించి వెళుతున్నా సరే...

"ప్రత్యేకత"ను కోల్పోయిన నీ మనసు...

వాటికి చలించదు...ఆనందించదు...

ఇదే స్థితప్రజ్ఞుని లక్షణం...

స్రష్ట యొక్క తీర్పు వలననే

సృష్టి యొక్క తీరు ఉన్నది.

మధ్యలో నీవు దూరి తీర్పు ఇవ్వకు.

ఇదే స్థితప్రజ్ఞుని లక్షణం.

దేనినీ సమర్థించకు.

దేనినీ విమర్శించకు.

ఉన్నదానిని ఉన్నట్లుగా స్వీకరించు.

ఇదే స్థితప్రజ్ఞుని లక్షణం.

అన్నీ కను...

అన్నీ విను...

తీర్పులేని మనసుతో కను, విను.

ఇదే స్థితప్రజ్ఞుని లక్షణం.

* * *

## 217. మిత ఆహారం-మిత వ్యవహారం

ఏడంతస్తుల మేడ కట్టాడు గురునానక్ శిష్యుడొకడు...

గృహప్రవేశానికి గురువును ఆహ్వానించాడు...

గురువును ఘనంగా సత్కరించాడు శిష్యుడు...

గురువు తిరుగుప్రయాణమౌతూ, తన జోలెలో దాచి ఉంచిన చిన్న సూదిని శిష్యుని చేతిలో పెట్టి, "నాయనా...మనం పరలోకంలో కలుసుకున్నప్పుడు ఈ సూదిని తిరిగి నాకివ్వు" అంటాడు.

శిష్యుడు ఆశ్చర్యపోతూ-

"గురువుగారూ...అదెలా సాధ్యం...!!" అంటాడు.

"ఏడంతస్తుల మేడను నీతోపాటే పరలోకానికి తెచ్చుకోగాలేంది... నా చిన్నసూదిని తేలేవా?" అంటాడు గురువు.

అంతే... గురుబోధ అవగతమైంది శిష్యుడికి.

* * *

పుచ్చిన వక్కయినా మన వెంటరాదు...అంటాడు రామదాసు...

* * *

నీవు పోతే అసలు ప్రపంచమే ఉండదు...

అంటారు మా గురుదేవులు...

* * *

ఇలాంటి కథలు...

ఇలాంటి వాక్యాలు...

సదా మననం చేసుకుంటూ ఉండాలి...

మన పిల్లలకు చెబుతూ వుండాలి...

తరతరాలకు మన ధనం అందాలనుకోవడం కాదు,

నీ జ్ఞానానికి వారు వారసులు కావాలి...

నీ సంస్కారానికి వారసులు కావాలి...

వైరాగ్యమే మన భారతీయ సంపద...

దాన్నెవడూ కొల్లగొట్టలేడు...

"నా నిజమైన వారసులు మీరే"....

అని శిష్యులతో గురువుగారు అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి...

ఆస్తులే నిజమైన వారసత్వం అని మన ప్రాచీనులు అనుకునివుంటే...

ప్రాచీన వాఙ్మయం మనవలకు చేరివుండేది కాదు...

వేదాల్లోని ఒక్క అక్షరం కూడా తాళపత్రాలలో లిఖించబడలేదు...

అవి శ్రుతులు...

ఒకరి నుంచి ఒకరికి శబ్దరూపంగానే తరతరాలుగా అందించుకుంటూ వచ్చారు...

చాలామంది వేదపండితులు నిరక్షరాస్యులు...

అని ఎక్కడో చదివి ఆశ్చర్యపోయాను....

వారికి లిపితో పనిలేదు...

* * *

నాగరికత అభివృద్ధి అంటే

భౌతికపదార్థంలోని ఆత్మశక్తిని గుర్తించడంలో గల క్రమాభివృద్ధి అంటారు వివేకానందులు...

అంతేగానీ మిద్దెలు మేడలు పెరగడం కాదు...

తక్కువ వస్తువులతో...

తక్కువ మాటలతో...

తక్కువ తలంపులతో...

తక్కువ ఆహారంతో...

తక్కువ వ్యవహారంతో...

ఆనందంగా...సుఖశాంతులతో...

గడిపే టెక్నిక్ డెవలప్ కావడమే నిజంగా అభివృద్ధి అంటే.

మన భారతీయ సంస్కృతిని తేటతెల్లంగా అవగాహన చేసుకోవడం వల్లనే అది సుసాధ్యం.

ప్రస్తుతం మన సంస్కృతికి సంబంధించిన అవగాహనను గజిబిజి చేసేసుకున్నాం.

ఓ జోక్ విన్నా ఈ మధ్య....

ఈ సోషల్ మీడియాలో ఆరోగ్యసూత్రాలు బోధించేవాళ్లంతా ఏమి తినొద్దని చెప్పారో, నిజంగా అవన్నీ వదిలేస్తే, మనకు మిగిలేది ఖాళీ కంచమే...అని.

అలా ఈ ఆధ్యాత్మిక ఉపన్యాసకుల వల్ల గజిబిజి పెరిగి, కాస్తో కూస్తో మనకున్న క్లారిటీ కూడా పోయి, ఏం చేయాలో తోచని పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యక్ష గురుసన్నిధి ఒక్కదానివల్లనే క్లారిటీ లభిస్తుంది.

వేలగ్రంథాలు చదివినా లభించని స్వరూపనిష్ఠ

ఒక్క సద్గురు సన్నిధి మాత్రంచేతనే లభిస్తుంది.

ఈమధ్య అత్యాశ్రమానికొచ్చిన అతిథి ఒకరు తిరుగుప్రయాణమవుతూ నన్నడిగారు-

"మీరు పొందారా?" అని.

"మీరేమనుకుంటున్నారు?" అని అడిగా...

"మీ రచనలను బట్టి మీరు పొందారనే  అనుకుంటున్నాను." అన్నాడు.

'మీరు ఎలాగైనా అనుకోండి....

కానీ "నేను పొందాను" అన్నా అబద్ధం అవుతుంది. "నేను పొందలేదు" అన్నా అబద్ధం అవుతుంది. అని సమాధానమిచ్చాను.

'మౌనం-శూన్యం-పూర్ణం' ఏకమైతే అదే "నేను".

'జననం-జీవితం-మరణం' లేకపోతే అదే "నేను".

అద్దం అన్నిటినీ ప్రతిబింబిస్తుంది.

కానీ తనను తాను ప్రతిబింబించుకోలేదు.

నేను అన్నింటినీ నిర్వచించగలనేగానీ,

నన్ను నేను నిర్వచించుకోలేను.

అందుకే 'నేనెవడను' అనే ప్రశ్న ఎప్పటికీ శేషప్రశ్నే.

సృష్టిలో సమాధానం లేని ఏకైక ప్రశ్న 'నేనెవడను'.

* * *

**218. అంతిమ ప్రయోజనం**

గురు-శిష్య భేదం తొలగిపోవడమే

సద్గురు సత్సంగం యొక్క అంతిమ ప్రయోజనం.

దేవ-జీవ భేదం తొలగిపోవడమే

దైవోపాసన యొక్క అంతిమ ప్రయోజనం.

అనేకత్వాన్ని విడిచి ఏకత్వం వైపుకు చేరడమే

ఈ ఆధ్యాత్మికతకు  అంతిమ ప్రయోజనం.

అభేదభావం కేవలం సిద్ధి కలిగినప్పుడు మాత్రమే కాదు,

సాధనావస్థలో కూడా అభేదభావం కలిగి ఉండడమే

సద్గురు సంప్రదాయం.

భేదభావనాత్

సో2హ మిత్యసౌ

భావనా2భిదా

పావనీ మతా

ఈశ్వరుడు వేఱు, నేను వేఱు అనే భావముతో కూడిన ఈశ్వరభావన కంటే

'అతడే నేను' అన్న అభిన్నభావనయే పావనమైనది

అన్న రమణుల మాటే పరమ ప్రమాణం.

* * *

"మీరు భగవంతుణ్ణి లేదా ఆత్మను పొందిన

అనుభవం మీకు లేకపోవచ్చునుగాక....

కానీ 'నేను పొందాను' అనే భావనతోనే

నా సన్నిధికి  రండి..."అంటుంటారు గురువుగారు.

ఆత్మానుభవం పొందావా? అని నిన్నెవరైనా అడిగితే

"పొందాను" అని ఘంటాపథంగా చెప్పండి అంటారు గురువుగారు.

యెందుకంటే, నీ స్వరూపమే అది....

నేను పొందలేదు....అని నీవనుకుంటే, నీవు కూర్చున్న చాపకు కూడా అవమానమే....అన్నారు గురువుగారు.

కాకపోతే అది జ్ఞప్తికి రావడానికి కొందరికి కొంత సమయం పట్టొచ్చు అంతే.

భూమిలో విత్తు పాతగానే చెట్టు మొలకెత్తాలంటే ఎలా?

యెదురుచూడాలి....

IAM THAT IAM (నేను అదే నేను) అనేది పక్కా.

అదే నేనన్న జ్ఞప్తికి తెచ్చేవే ఈ అధ్యయనము, సద్గురుప్రబోధము, ధ్యానము....మొదలైనవి....

* * *

'సమస్య తెగకో...

సమస్య తెగడంఇష్టం లేకనో...

లేక ప్రశ్నించడం స్వభావమై ఉండడం వల్లనో

సదా ప్రశ్నిస్తూనే ఉంటారు కొందరు...

సమాధానం పొందటం వారికి  ఇష్టం లేదు....

ప్రశ్నించడం ఒక వ్యసనం....

ఇదొక రకమైన దురద అంటారు గురువుగారు.

సత్సంగం అంటే, చుట్టూ కూర్చొని ఒకరి వీపు ఒకరు గోక్కోవడం లాంటిది అంటారు.

* * *

గురువు ద్వారా సమాధానం కాదు,

గురువే సమాధానం.

* * *

వారి ప్రశ్నలు ఒకస్థాయికి చేరుకున్నాక...

'నిద్రలో అడగండి చెబుతాను....'అని గురువుగారనడం కద్దు.

అంతటితో ప్రశ్నల పరంపరకు ఫుల్ స్టాప్ పడుతుంది.

* * *

ప్రశ్న - వ్యక్తిగతమైనది.

సమాధానం - సర్వగతమైనది.

* * *

సద్గురు అనుగ్రహప్రసారానికి,

సద్గురు నిజబోధాప్రవాహానికి

మన ప్రశ్నే (మాటే)ఆటంకం.

* * *

మాట ఆగిపోతే మనసు మూగబోతుంది.

మనసు మూగబోతే ఆత్మ తేటపడుతుంది.

* * *

## 219. శిష్యుడు ఇవ్వాలి, గురువు తీసుకోకూడదు

"శిష్యుడు ఇవ్వక చెడతాడు.

గురువు తీసుకుని చెడతాడు."

అన్నారు గురువుగారు సత్సంగంలో.

అంతే. దాని గురించి ఇక ఏ వివరణా ఇవ్వలేదు.

అంటే, శిష్యుడు ఇవ్వాలి,

కానీ గురువు తీసుకోకూడదు...

ఇదెలా సాధ్యం!

ఆ వాక్యాన్ని  నా డైరీలో వ్రాసుకున్నానేగాని, చాన్నాళ్లపాటు నా మనసులో నలుగుతూనే ఉంది అర్థం కాక...

"వివరించమని గురువుగార్నే అడగొచ్చు కదా!" అంటారేమో!

అలా ఓ సారి వివరణ అడిగినప్పుడు-

"అన్నీ నేనే చెప్పేస్తే, ఇక నీ బుర్రకు పనేముంటుంది? నువ్వే ఆలోచించు." అన్నారు.

అప్పట్నుంచి వినడమేగాని, వివరణ అడగడం మానేశాను...

'జ్ఞానప్రసూనాలు' అనేవి మూల బీజాలు...

'జ్ఞానధార' అనేది వివరణాత్మక వ్యాసాలు...

జ్ఞానప్రసూనాల్లోని ఒక్కొక్క వాక్యానికి ఒక్కొక్క వ్యాసం వ్రాయొచ్చు....

'పరమపదం'  కూడా అన్నిట్లో ఒకటిగా వ్రాసుకున్నానేగాని,

అదే మా అత్యాశ్రమానికి అధిష్ఠానదైవంగా అవుతుందని అప్పుడు అనుకోలేదు.

అలా చాలా వాక్యాలు చాలా కాలం తర్వాత అర్థమైనవి కూడా ఉన్నాయి...

వాటిల్లో ఇదొకటి...

శిష్యుడు ఇవ్వక చెడతాడు.

గురువు తీసుకొని చెడతాడు.

* * *

"మహాభక్తవిజయం" చదువుతుంటేను, అందులో ఉన్న సమర్థరామదాసుగారి జీవిత చరిత్రలో ఓ మధురఘట్టం నా కంటపడింది...

సమర్థరామదాసు కౌపీనధారి...

శివాజీమహారాజుకు గురువు...

తుకారాంకు సమకాలీనుడు...

దేశమంతా సంచరిస్తూ...

లక్ష హనుమత్ మూర్తులను ప్రతిష్ఠించినవారు...

"దాసబోధ" గ్రంథకర్త...

* * *

వారికి చిట్టడవిలో గడపడం ఇష్టం...

భిక్షకై ఊళ్లోకి వచ్చేవారు...

ఓరోజు శివాజీ కోటగుమ్మం వద్ద భిక్షకై నిలబడ్డాడు...

సైనికులు పరుగుపరుగున వెళ్లి మహారాజుకు తెలిపారు..."గురువుగారు భిక్షకై వచ్చివున్నారు" అని.

శివాజీ మహారాజ్ తన యావత్ సామ్రాజ్యాన్ని తన గురువుకు ధారాదత్తం చేస్తున్నట్టు గురువు పేర ఓ పత్రం వ్రాయించి, గురువుగారి జోలెలో వేసి "ఒంటి"గా నిలబడ్డాడు.

సమర్థరామదాసు ఆ పత్రం తీసుకొని చదివి ఇలా పలికారు-

"ఈ క్షణం నుంచి ఈ మహాసామ్రాజ్యానికి నేను సర్వాధిపతిని.

నిన్ను (శివాజీని) నా ప్రధాన సేవకుడుగా నియమిస్తున్నాను...

ఇక నుంచి హైందవధర్మపరిరక్షణ చేయి...

ప్రతి ఇంటి పైనా కాషాయజెండాలు ఎగురవేయి...

ఇది నా ఆజ్ఞ...." అంటూ తిరిగి పత్రం శివాజీ చేతిలో ఉంచి, తిరిగి చిట్టడవిలోకి వెళ్లిపోయారు....

శిష్యుడు ఇవ్వడమూ జరిగింది.

గురువు తీసుకోకపోవడమూ జరిగింది.

నాకు సద్గురు వాక్యము అవగతమూ అయ్యింది.

* * *

**220. శిశువు ఏడుపే, శిశువు బలం**

కోవిడ్ లో లాక్ డౌన్ కారణంగా మా షాప్ మూసివేయడం జరిగింది...

ఇల్లు-మందిరం-సత్సంగం

తప్పితే మరో దృశ్యం కనలేదు... మూడునెలలు...

తిన్నామా-పడుకున్నామా-తెల్లారిందా

అన్నట్టు నోమరిగా సాగింది ఆ కొద్దికాలం...

అయినా జీవితం సద్వినియోగం అవుతూనే ఉంటుంది.

ప్రతి నది ప్రవాహం సముద్రం వైపుకే అన్నట్టు

మనం వేసే ప్రతి అడుగూ పడేది సత్యం వైపుకే.

ప్రతి క్షణం "సత్"కే వినియోగం అవుతోంది కాబట్టి,

ప్రతి ఒక్కని జీవితమూ సద్వినియోగం అవుతోందనేది  నా ఫిలాసఫీ.

"వేస్టుగాడు" అనేవాడు ఒక్కడూ ఉండడు సృష్టిలో.

మనం సోమరి అని ఎవర్ని అంటున్నామో,

వాడు కూడా సృష్టిప్రయోజనాన్ని నెరవేర్చే కార్యక్రమంలో భాగస్తుడే.

ఒక యంత్రంలో కదిలే భాగమూ ఉంటుంది, కదలని భాగమూ ఉంటుంది.

కదలని భాగాన్ని సోమరి అంటే ఎలా?

అది కూడా కదిలితే యంత్రప్రయోజనం చెడుతుంది.

* * *

కోవిడ్ కాలంలో ప్రతిరోజు సాయంత్రం మా వీధిలో ఉన్న శ్రీరామ మందిరంలో గడపడం జరిగింది...

ఆ అవకాశాన్ని సద్-వినియోగం చేసుకుంటూ...

రాముని సన్నిధిలో "నా గురువు" వ్యాసాలను వ్రాయడం ప్రారంభించాను ఫోన్ నోట్స్ లో...

తెలిసిందేగా...

వ్రాసిన ప్రతి వ్యాసాన్నీ ఎప్పటికప్పుడు  వాట్సప్, ఫేస్ బుక్ లో పెట్టేయడం జరిగింది...

భీమవరం నుండి గురుభక్తులు నాకు ఫోన్ చేసి..."నా గురువు" వ్యాసాల ప్రచురణ విషయమై ప్రస్తావించారు...

ఇప్పటికే కొంతమంది భక్తులు కూడా ఆ వ్యాసాలు పుస్తకరూపంలోకి రావాలని కోరారు... కొందరు ఆర్థికసహాయం చేస్తామని కూడా అన్నారు...

కానీ పుస్తకప్రచురణ విషయంగా ఏ రకంగానూ ఇక మూవ్ అవదలచుకోలేదు...

"నా గురువు " వ్యాసాలను...

whatsappలో...facebookలో...పెట్టడం తప్ప...

ఒక్క అక్షరం కూడా వ్రాసి, నా వద్ద ఉంచుకోలేదు...

అంటే వాటిని "గాలి"కి(వాయులింగేశ్వరుడికి) వదిలేశాను.

అందులో ఒక్క అక్షరం కూడా కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడుకునే బాధ్యతను జ్ఞానప్రసూనాంబకే వదిలేశాను.

* * *

అంతర్యామి...అలసితి... సొలసితి...

అని అన్నమయ్య అన్నట్టు...

ఇప్పటివరకు చేసిన 26 పుస్తకాల ప్రచురణ విషయమై తిరుపతికి పలుమార్లు ప్రయాణం చేయడం వలన వచ్చిన అలసట వలన వచ్చిన వైరాగ్యం అది.

కానీ జ్ఞానాంబ నా వ్యాసాలపై...

ఓ కన్నువేసి ఉంచే ఉందని అనిపించేది...

* * *

కొరియర్ లో పెద్ద పార్శిల్ ఒకటి వచ్చింది. నాకు అంత పెద్ద పార్శిల్ రావడం అదే మొదటిసారి...

అది ఏమా!! అని ఆశ్చర్యపోయాను...

పెద్ద అట్టపెట్టె...

పది నిమిషాలు కష్టపడి పార్శిల్ విప్పాను...

ఆశ్చర్యం!! అందులో  పసుపు అట్ట బైండింగ్ తో ఉన్న "నా గురువు" పుస్తకాలున్నాయి...

జ్ఞానప్రసూనాంబ సాక్షాత్కరించినంత ఆనందం కలిగింది.

ఈరోజును నా జీవితంలో మరపురాని ఓ శుభదినంగా గుర్తుంచుకుంటాను... "నా గురువు" వ్యాసాలను పుస్తకరూపంలో చూసుకున్నాను...

నా నమ్మకాన్ని నిజం చేస్తూ...

గురుభక్తులు వాట్సప్ లో నేను పంపిన 108 వ్యాసాల pdf లను printout చేసి...పుస్తకరూపంగా అందంగా బైండ్ వర్క్ చేసి...నాకొక సెట్టు, గురువుగారికొక సెట్టు పంపారు...

అంతేనా...దక్షిణ కూడా పంపారు...

"జ్ఞానాంబ దయామయి" అన్న మాట నిరూపణ అయ్యింది...

శిశువు ఏడుపే శిశువు యొక్క బలం.

తల్లి పరుగెత్తుకు వచ్చి ఎత్తుకుంటుంది.

గుండెలకు హత్తుకుంటుంది.

లావొక్కింతయు లేదు...అన్న గజేంద్రుణ్ణి అనుగ్రహించడానికి...

సిరికింజెప్పడు....లక్ష్మీదేవికి కూడా చెప్పకుండా పరుగెత్తుకొచ్చాడు...

త్రికరణశుద్ధిగా...నీవు చేతులెత్తేసినప్పుడు...

భగవంతుని చేతులు పనిచేయడం చూస్తావు...

* * *

## 221. ఉన్నదానిని ఉన్నట్టుగా చూడడమే దైవదర్శనం

నాది అని చెప్పగలిగింది దేన్ని కూడా...

'నేను' అని చెప్పకూడదు...

దేహం నాది అంటాం...

దేహం నా సొత్తేగానీ నేను కాదు అని అర్థం.

'నేను' ధరించిన చొక్కా ఈ దేహం.

దేహం కదిలినప్పుడల్లా చొక్కా కదులుతుంది.

'నేను' కదిలినప్పుడల్లా దేహం కదులుతుంది.

చొక్కా తీసి కొక్కేనికి తగిలించేస్తే, ఇక అది కదలదు...

దానినే 'నిద్ర' అనేది మనం.

నామం ఉండి రూపం లేనివి కొన్ని ఉన్నాయి.

రూపం ఉండి నామం లేనివి కొన్ని ఉన్నాయి.

నామం ఉండి రూపం లేకపోయినా...

రూపం ఉండి నామం లేకపోయినా...

ప్రాణం మాత్రం ఉంటుంది.

శవంలో ప్రాణం ఉండదని చెబుతామేగానీ...

రూపం ఉంది.

రూపం ఉంది కాబట్టి ప్రాణం ఉన్నట్టే.

శవంలో ప్రాణం ఉంటుందిగాని, ప్రాణశక్తి కనిపించదు.

శక్తి ఉండదా? అంటే,

శక్తి ఉంటుంది అప్పుడు కూడా...

ప్రాణంలో కలిసిపోయి గుప్తంగా ఉంటుంది.

శక్తి గుప్తంగా ఉండి...

పైకి ప్రాణస్వరూపంగా కనిపించేది శివుడు.

ప్రాణం గుప్తంగా ఉండి...

పైకి ఉనికిగా కనిపించేది పార్వతి.

వినేవాడు లేకుండా చెప్పేవాడు...

చెప్పేవాడు లేకుండా వినేవాడు...

ఇద్దరూ పిచ్చివాళ్లుగానే కనబడతారు లోకానికి.

మన జీవితకథకు సంబంధించిన script...

Already మనం పుట్టకముందే Record అయిపోయింది.

అని మనం అనుకునే మాటలు కూడా రికార్డులో ఉన్నవే.

అవన్నీ మెలకువలో చెప్పుకునే మాటలే...

మర్చిపోయాను...అనేది కూడా ఓ జ్ఞాపకమే.

దానిని 'అది' అని చెప్పడం కూడా తప్పే...

'అది' అని చెప్పగానే అది 'ఇది' అయిపోతుంది.

"ఇది" అని ఇదమిత్థంగా చెప్పలేం కాబట్టి...

నేతి(ఇది కాదు)...అని చెప్పారు ఋషులు.

'అది'కి సరైన నిర్వచనం ఏమంటే-

నేతి(ఇది కాదు)అనడమే.

'నేను' అంటే, నేను కాకుండా ఐపోతుంది.

'నేనుకాదు' అని ఉంటే,

అదే 'నేను నేనుగా ఉండడం' అవుతుంది.

గోళ్లు కత్తిరించడం అంటే, దానిఅర్థం-

గోళ్లను దేవుడు అనవసరంగా పెట్టాడనా...?

కాదు కదా...!

వాటి అవసరం ఉండనే ఉంటుంది.

ఆవులో కొమ్ములు కఠినంగా ఉంటాయి.

రొమ్ములు మృదువుగా ఉంటాయి.

దేని అవసరం దానిదే.

అలాగే సృష్టిలో ఉన్న ప్రతీది అవసరమే.

దేనినీ త్రోసివేయకుండా...

నీ నిర్వచనంతో ప్రకటించకుండా...

ఉన్నదానిని ఉన్నట్టుగా...

యథాతథంగా చూడడమే దైవదర్శనం.

* * *

## 222. మెలకువ నుండి మెలకువ

"మరుజన్మే కాదు, ప్రస్తుత జన్మ కూడా లేదు..."

అన్న సద్గురు వాక్యానికి ఒకరు కోరిన వివరణకు సూటి సమాధానం-

అవును... "అసలు మీరు లేనే లేరు" అనేదే.

కల నుండి మేలుకొన్నాక...

కలలో ఉన్న నీతో సహా సకలమూ లేకుండా పోయినట్లు...

నీవు, నీ ప్రపంచం లేకుండా పోవడమే నిజమైన మెలకువ(యదార్థ జాగ్రత్తు)

"లేకుండాపోవడం" అంటే,

ఈ 'మిథ్యానేను'కు ఉనికే లేదని తెలుసుకోవడం.

"ఆకాశ కుసుమం" వలె.

* * *

కలల పరంపరలకు నిద్ర ఆధారమైనట్టు

జన్మ పరంపరలకు అజ్ఞానమే ఆధారం.

కలలు ఉండకూడదు అనుకుంటే,

నిద్ర నుండి మేలుకోవాలి.

జన్మలు ఉండకూడదు అనుకుంటే,

మెలకువ నుండి మేలుకోవాలి.

అందుకే కఠోపనిషత్తు మేలుకో-మేలుకో అంటోంది.

"అరే...నేను మేలుకునే ఉన్నానుగా...మళ్లీ మేలుకోమని చెబుతున్నారేమిటి?" అనుకుంటారు.

అవును....మెలకువ నుంచి మేలుకోవాలి.

అదే మోక్షం.

తరువాత కూడా కలలు(జన్మలు) ఉండవచ్చుగాక!

కానీ వాటికి ప్రాభావితుడు కాడు...అనగా దుఃఖం ఉండదు.

అటువంటి మహనీయుడు, ప్రతి జన్మలోనూ-

సంపూర్ణమైన ఎరుకతో జన్మిస్తాడు...

సంపూర్ణమైన ఎరుకతో జీవిస్తాడు...

సంపూర్ణమైన ఎరుకతో దేహాన్ని చాలిస్తాడు...

ఎఱుకే జ్ఞానం.

ఎఱుకే మోక్షం.

ఆ ఎఱుక కలగాలంటే,

మెలకువ నుండి మెలకువ కలగాలంటే

అందుకు రెండే మార్గాలు-

1. సద్గురు సాంగత్యం.

2. యోగవాశిష్ఠ పారాయణం.

* * *

గురువు లేనివారికి యోగవాశిష్ఠమే గురువు.

జన్మ-కర్మ సిద్ధాంతాన్ని బహు చక్కగా నిరూపణ చేసినవాటిల్లో యోగవాశిష్ఠం ప్రధానమైనది.

వాశిష్ఠంలో ఇందుకు అనేక కథలతో నిరూపించి వున్నారు.

యోగవాశిష్ఠ గ్రంథాన్ని ప్రతిరోజూ కొన్ని పేజీలు పారాయణం చేస్తూ ఉండండి... Confuse పోతుంది.

గ్రంథరూపంలో ఉన్న గురువు - యోగవాశిష్ఠం.

పరబ్రహ్మమే గ్రంథరూపం దాలిస్తే అదే యోగవాశిష్ఠం.

ప్రశ్న పరంపరలకు బ్రహ్మాస్త్రం - యోగవాశిష్ఠం.

నిన్ను నీకు గుర్తుకు తెప్పిస్తుంది - యోగవాశిష్ఠం.

'శ్వాస మీద ధ్యాస' ఉంచితే అది ధ్యానం.

'ధ్యాస మీద ధ్యాస' ఉంచితే అది జ్ఞానం.

ధ్యాస మీద ధ్యాసను కలిగిస్తుంది యోగవాశిష్ఠం.

ఇది నా స్వానుభవం.

స్వరూపనిష్ఠయే సకల ప్రశ్నలకు సమాధానం.

స్వరూపనిష్ఠను కలిగిస్తుంది యోగవాశిష్ఠం.

నిద్ర నుండి మేలుకొలుపుతుంది - అలారం.

మెలకువ నుండి మేలుకొలుపుతుంది - వాశిష్ఠం.

* * *

నిన్న ఒకరు ఫోన్ చేసి ఓ సందేహం....అంటూ

తనకు తెలిసిన బ్రహ్మసూత్రాలన్నీ ఏకరువు పెడుతున్నాడు...

తనకు తెలిస్తే చాలదు...

తనకు తెలుసు అన్న విషయం ఇతరులకు తెలియాలి...

అన్న ఉబలాటమే ఎక్కువగా ఉంటుంది కొందరిలో...

అతను ఉదహరించినవన్నీ ultimate సూక్తులే...

కానీ దేంట్లోనూ స్థిరంగా ఉండడు.

గట్టిదో ఒట్టిదో ఏదో ఒక తెప్పలో నదిని దాటాలి అంతే.

తెప్పల్ని కలెక్షన్ చేసుకోవడంలోనే, సెలక్షన్ చేసుకోవడంలోనే జీవితం ఐపోతోంది.

ఇక దాటడం ఎప్పుడు?

అతనికి నా సమాధానం వినాలన్న తపన కంటే,

తనకు తెలిసిన విషయజ్ఞానాన్నంతా వాంతి చేసుకోవలన్న తపన ఎక్కువగా కనిపించింది.

అదొక వ్యాధి.

తెలిసింది తెలిసినట్టు మ్రింగేసి,

జీర్ణం చేసేసుకోవాలి; కక్కకూడదు...

* * *

**223. మరణ జయం-మృత్యురహస్యం**

కాలప్రవాహంలో తేలియాడుతూ

కదులుతున్న 'కాగితపు పడవ' తాను.

అది నీటిలో నానే కొద్దీ మునగడానికి సమయం దగ్గరపడుతున్నట్లే.

నానుతుండడమే - జీవితం.

మునిగిపోవడమే - మరణం.

ఈ కట్టె కట్టెల్లో కాలకమునుపే

ఈ మట్టిపెళ్ల దేహం మట్టిలో కలవక మునుపే

మృత్యురహస్యాన్ని కనుగొనటమే జీవితపరమార్థం.

మనకున్న అన్ని భయాలకు తల్లి లాంటిది మరణభయం. మరణం భయమే మిగతా వివిధరకాల భయాలుగా మనకు అనుభవంలోకి వస్తాయి. మరణభయమే లేదంటే, ఇక ఏ భయమూ ఉండదు. ఏ రకమైన భయం ఉన్నా సరే వారికి మరణభయం ఉన్నట్టే.

* * *

పుట్టుక అనేది మన ప్రమేయం లేకుండా జరిగిన ఓ హఠాత్ ఘటన.

జీవితమూ, అందులోని ప్రతి సన్నివేశమూ హఠాత్తుగా సంభవించేవే; నీవు ప్లాన్ వేసుకుని చేసే కర్మలైనా సరే.

చివరకు మరణమూ అంతే.

అదీ ఓ నివారించలేని ఓ హఠాత్ ఘటనే.

మరి మనం ఇంచుకైనా నివారించలేని

ఈ హఠాత్ సంఘటనల సమ్మేళనమైన జీవితం విషయంలోగానీ,

చిట్టచివరి ఘటన ఐన మరణం విషయంలోగానీ

తానెందుకు ఆందోళన పడడం?

ఆందోళనకు మూలకారణం ఒక్కటే-

నేను-నాది అనే భావన.

నిజానికి ఈ నేను-నాది  అనేవి ఎవడి సొత్తో

వాడికి(ఈశ్వరుడికి)స్వచ్ఛందంగా వాటిని అప్పజెప్పడమే శరణాగతి.

* * *

నేను-నాది భావనను వదలనంతవఱకు మృత్యుభయం తప్పదు.

దృతరాష్ట్రుడు అటువంటి భావనను వదలకనే

మృత్యుభీతితో ఇలా ప్రశ్నించాడు సనత్సుజాతులవారిని.

దృతరాష్ట్రుడు: మీరు చిరంజీవులు....సృష్ట్యాది నుండి మీరు ఇలానే ఉన్నారు...

మా పూర్వీకులందరూ మరణించారు....త్వరలో నేనూ మరణిస్తాను...

మీ విషయంలో చూస్తే -

మరణం అర్థరహితం.

మా విషయంలో చూస్తే -

మరణం అనివార్యం.

ఇంతకీ మరణం అనేది ఏమి?

మరణం అనేది ఉందా?లేదా?

సనత్సుజాతులు: నీవు శాశ్వతమైన వస్తువును ధ్యానిస్తే నీవు శాశ్వతుడవు.

నీవు అశాశ్వతమైన వస్తువును ధ్యానిస్తే

నీవు అశాశ్వతుడవు.

* * *

అశాశ్వతవస్తువులైన నేను-నాది లను వదిలి

శాశ్వతమైన మహేశ్వరుని (పరమాత్మ) చరణాలకు శరణుపొందు.

ఆ పూర్ణార్పణం వలన నీవే ఈశ్వరుడవుతావు.

మృత్యుదేవతకు నీవే అధిపతి అవుతావు.

మరణభయం లేని కాలకాలుడవుతావు.

మరణభయం తొలగడమే మరణజయం.

* * *

## <u>224. తానుండడమే దేవుడుండడం, ఆస్తికుడు-నాస్తికుడు</u>

దేవుడు ఉన్నాడు...అని వాదిస్తాడొకడు...

ఉండనీ...

ఇక వాదన ఎందుకు?

ఉన్నాడని నిజంగా నీకు తెలిస్తే వాదించవు.

ఉన్నాడని వాదిస్తున్నావంటే...

లేడేమోనని ఏ మూలనో కాస్త అనుమానం నీకు ఉన్నట్టే.

దేవుడు లేడనే నాస్తికుడు కూడా వాదించనక్కర్లేదు.

లేనివాని గుఱించి ఇతరులతో గొడవెందుకు?

వాదిస్తున్నాడంటే, ఉన్నాడేమో అని ఏ మూలనో అతనికి అనుమానం ఉన్నట్టే.

వాదనకి కారణం, తనలో ఉన్న సంశయమే.

కాబట్టి-

వాదించే ఆస్తికుడు సంపూర్ణ ఆస్తికుడు కాదు.

వాదించే నాస్తికుడు సంపూర్ణ నాస్తికుడు కాడు.

సంపూర్ణ ఆస్తికుని, సంపూర్ణ నాస్తికుని

స్థితి ఒక్కటే - 'మౌనమే'.

* * *

'దేవుడు లేడు' అని వాదించేవాడొకడు

గురువుగారిని వాదనకు ఆహ్వానించాడు...

వెళ్లారు గురువుగారు...

ఇద్దరూ చాపలు పరచి ఎదురెదురుగా కూర్చున్నారు...

'దేవుడు లేడు' అని నా అభిప్రాయము' అన్నాడా నాస్తికుడు.

'ముమ్మాటికీ నా అభిప్రాయం కూడా అదే' అన్నారు గురువుగారు.

ఆ నాస్తికుడు అవాక్కయ్యాడు....

వాదనకు అవకాశం లేకుండా అయిపోయినందుకు...

'అదెలా అండీ......మరో మాట చెప్పండీ...' అన్నాడతడు.

'ఒకటే మాట... మీ మాటే నా మాట...' అన్నారు గురువుగారు.

అంతటితో నిరాశతో లేచి వెళ్లిపోయాడతడు.

* * *

దేవుడు ఉన్నాడు అన్నవానితో 'లేడు' అని వాదిస్తే ఘర్షణ ఉంటుంది.

దేవుడు లేడు అన్నవానితో 'ఉన్నాడు' అని వాదిస్తే ఘర్షణ ఉంటుంది.

లేడు అన్నవానితో లేడు అని,

ఉన్నాడు అన్నవానితో ఉన్నాడు అని అంటే

ఇక వాదనకు అవకాశం ఎక్కడిది?

జయాపజయాలకు అవకాశం ఎక్కడిది?

'నేను ఓడిపోయాను' అని ఒప్పుకున్నవాడిది కూడా గెలుపే.

అక్కడ ఘర్షణకు చోటుండదు.

ఘర్షణ లేకుండడమే విజయం.

* * *

ఒక గాజు గ్లాసులో నీళ్లు అర్ధభాగం నింపబడి ఉంది...

ఒకడు 'సగం గ్లాసులో నీళ్లు ఉన్నాయి' అని నీళ్లు ఉన్న భాగం వైపుకు చూసి అంటాడు. మరొకడు నీళ్లు లేని భాగం వైపు చూసి సగం గ్లాసులో నీళ్లు లేవు అంటాడు.

ఇద్దరు చెప్పిందీ సత్యమే.

నీళ్లు ఉన్నా లేకున్నా గ్లాసు ఉంటుంది.

అదే ఆధార సత్యము.

ఒకాయనకు మీసాలున్నాయని ఒకడు,

ఆయనకు మీసాలు లేవు అని ఒకడు వాదించుకుంటున్నారట...

కానీ మీసాలు ఉన్నా లేకున్నా ఆ మనిషి ఉండాలిగా...

అదే ఆధార సత్యము.

'దేవుడు లేడు' అనే నాస్తికుడైనా 'తాను' లేడు అనడు....అంటారు భగవాన్.

తానుండడమే దేవుడుండడం.

* * *

నా చిన్నప్పుడు బాలచంద్రికలో చదివిన వివేకానంద బొమ్మల కథ ఒకటి గుర్తుకొస్తోంది...

టెక్సాస్ లో తుంటరి యువకులు కొందరు కిరోసిన్ డ్రమ్ము బోర్లించి, దానిమీద నిలబడి ఉపన్యాసం ఇమ్మంటారు-

వివేకానంద ఏ మాత్రం జంకు లేకుండా దాని మీదే నిలబడి ఉపన్యాసం ఇస్తారు.

ఆ సందర్భంలో వివేకానంద అన్న మాటలు-

'దేవుని మీద నమ్మకం లేని వారు నాస్తికులు కారు.

తమ మీద తమకు విశ్వాసం లేనివారే నాస్తికులు.

దేవుని మీద నమ్మకం ఉన్నవారు ఆస్తికులు కారు.

తమపై తమకు విశ్వాసం కలవారే ఆస్తికులు.

తమపై తమకు విశ్వాసం గల కొద్దిమంది వ్యక్తుల చరిత్రే ప్రపంచ చరిత్ర' అంటారు.

వీరికి ఏ మాత్రం విశ్వాసం ఉందో చూద్దామని ఆ తుంటరి యువకుల్లో ఒకడు గాలిలో తుపాకీ పేలుస్తాడు...

జనమంతా చెల్లాచెదురుగా పరుగులు తీశారు...

ఒక్క వివేకానంద మాత్రం చెదరక బెదరక నిలబడి ఉన్నారు...

ఆ యువకులు వివేకానంద విశ్వాసానికి, నిశ్చలత్వానికి ఆశ్చర్యపోయారు...

వివేకానంద పాదాలపై బడి క్షమాపణ కోరారు.

* * *

నేను-నేను అంటాడు వ్యక్తిగా.

ఇది కర్మయోగం.

నీవు-నీవు అంటాడు ఆర్తిగా.

ఇది భక్తియోగం.

నేను-నేను అంటాడు సమిష్టిగా.

ఇది జ్ఞానయోగం.

* * *

అజ్ఞాని, జ్ఞాని ఇద్దరూ దేహం నేననే అంటారు.

'దేహంలో నేనున్నాను' అని అంటాడు అజ్ఞాని.

'నాలో దేహముంది' అని ఉంటాడు జ్ఞాని.

* * *

నాస్తికుడు లాగే ఆస్తికుడు కూడా దేవుడు లేడనే అంటాడు...

"ఓ వ్యక్తిగా" దేవుడున్నాడని ఆస్తికుడూ ఒప్పుకోడు.

దేవుణ్ణి "మొత్తం"గా చూస్తాడు ఆస్తికుడు.

* * *

అజ్ఞాని దృష్టి - వస్తువులపై, వ్యక్తులపై ఎక్కువగా కేంద్రీకృతమై ఉంటుంది.

జ్ఞాని దృష్టి - వస్తువులతో, వ్యక్తులతో ఉన్నప్పటికీ

'ఉనికి' మీద కేంద్రీకృతమై ఉంటుంది.

* * *

ఒకడు సినిమాను చూస్తుంటే,

ఒకడు ఆధారతెరను చూస్తుంటాడు.

సినిమా చూస్తూ, తెరను మరచేవాడు - నాస్తికుడు.

తెరను చూస్తూ, సినిమా చూడనివాడు - ఆస్తికుడు.

ఇద్దరిదీ సరి కాదు....

1. తెర

2. తెరపై దృశ్యం

రెండూ ఏకకాలంలో జ్ఞప్తిలో ఉంచుకున్నవాడే పరిపూర్ణజ్ఞాని.

అన్నీ ఉంటాయి - ఏమీ ఉండవు.

ఇది జ్ఞాని స్థితి.

* * *

పరిపూర్ణ నాస్తికుడు ఆస్తికుడే.

పరిపూర్ణ ఆస్తికుడు నాస్తికుడే.

* * *

**225. తనకు హాయి కాదు; తానే హాయి**

నిద్రలో తానున్నానని తనకు తెలియకపోయినా తానున్నాడు.

యెందుకంటే మెలకువ రాగానే నేను హాయిగా నిద్రపోయాను అంటాడు.

'హాయి'ని అనుభవించేవాడు అక్కడ ఒకడు ఉండే ఉండాలి.

నిజానికి ఆ 'హాయే' తాను.

మెలకువలో ఉండి, హాయిని కోరేవాడు కాదు తాను.

ఆ 'హాయే' ఆత్మ, భగవంతుడు....ఇత్యాది పేర్లతో పిలువబడుతున్నాడు.

ఆ 'హాయి'గా ఉన్న తానే...

ఆ ఏకంగా ఉన్న తానే....

చెదరి... కదలి...మనసుగా మారి...

మెలకువలోకి...కలలోకి జారి...

ఈ ప్రత్యేకమైన తానుగా

అనగా పరిమితమైన వ్యక్తిగా...

జగత్తుగా విస్తరిల్లాడు....

ఏకంగా ఉన్న తానే అనేకం ఐన సంగతిని మరిచి, ఆ అనేకంలో ఏదో ఒక నామరూపాలు కలిగిన దేహాన్ని మాత్రమే తానని అభిమానించి, దానితో మమేకం అయ్యి, అది మాత్రమే తానని వ్యవహరిస్తూ, జీవిస్తూ, నానా అవస్థలు పడుతున్నాడు.

ఇదంతా మరపు వలన వచ్చిన అవస్థలే...

మరపుతో ఉన్న అవస్థలే ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్తులు.

ఎరుకతో ఉన్న అవస్థ - తురీయం.

* * *

నిద్రలో ఉన్న హాయిని,

మెలకువలో ఉన్న ఎరుకను

అనుసంధానం చేసే ప్రక్రియే - ధ్యానం.

* * *

స్వస్వరూపమైన ఆ 'హాయి'ని తిరిగి పొందటానికి

జీవుడు గురువును ఆశ్రయిస్తాడు...

గురువు అంటే తనకు విడిగా ఉన్న ఓ వ్యక్తి అని కాదు...

తనలోనే, తనకు అభిన్నంగా  ఉన్న ఓ 'ప్రజ్ఞ' అది.

యెప్పటికీ అలా తాను మరపులో ఉండకుండా

మళ్లీ తానెవరో గుర్తుకు తెచ్చే ఆ ప్రజ్ఞయే 'గురువు'.

కొందరికి ఆ గురువు పైకి ఓ వ్యక్తిలాగే కనబడవచ్చు బాబుకు సద్గురు సుబ్రహ్మణ్యునిలా...

కొందరికి ఆ గురువు పైకి కనబడకపోవచ్చు

రమణునికి ఈశ్వరునిలా...

ప్రజ్ఞయే సాకారంగా ఉంటే - గురువు.

ప్రజ్ఞయే నిరాకారంగా ఉంటే - ఈశ్వరుడు.

గుర్తుకు తెచ్చేవాడు గురువు.

వస్తువు ఇచ్చేవాడు కాదు.

నీదే, నీవే అయిన ఆత్మవస్తువును

గురువూ ఇవ్వలేడు, దేవుడూ ఇవ్వలేడు.

నిన్ను నీలోలోపలికి(ధ్యానంలోకి) త్రోయడం తప్ప.

* * *

అనంతమైన వస్తువు - సద్వస్తువు.

అది 'నేను'గా ఉంటుందేగాని 'నేను' అని అనదు, అనుకోదు.

పరిమితమైన ప్రతి వస్తువూ జడమే.

జడవస్తువు 'నేను' అని అనదు, అనుకోదు.

* * *

సద్వస్తువు 'నేను' అనదు - అన్యము లేక.

జడశరీరము 'నేను' అనదు - ఉనికి లేక.

ఈ మధ్యలో, ఈ రెంటి స్పర్శతో, దేహపరిమాణంలో

'నేను' అని ఒకటి పుడుతోంది.

* * *

విమానం జడం - పైలట్ లేకుండా ఎగురదు.

పైలట్ చైతన్యం - విమానం లేకుండా ఎగురలేడు.

ఈ రెంటి కలయిక వలననే విమానం ఎగురుతుంది.

శివ-శక్తుల కలయికే ఈ సృష్టి చలనానికి మూలం.

* * *

కాబట్టి జీవుడు -

పూర్తిగా జడమూ కాదు,

పూర్తిగా చైతన్యమూ కాదు.

జడ-చైతన్యముల కలయికే జీవుడు...

అదే చిజ్జడగ్రంథి...

అదే బంధము...

అదే జీవుడు...

అదే సూక్ష్మశరీరము...

అదే అహంకారము...

అదే సంసారము...

అదే మనస్సు...

* * *

## 226. సమత్వబుద్ధి-సృష్టి దేవుడు

దేవుడు అంటూ ఒకడు ఉండి,

వాడు పనిగట్టుకుని ఈ సృష్టి చేశాడు అని అంటే,

"ఎందుకు" చేశాడు? అనే ప్రశ్న వస్తుంది.

దేవుడు సృష్టి చేయడం కాదు,

సృష్టే దేవుడు.

ఆద్యంతములు లేని సృష్టి మాత్రమే ఉంది.

సృష్టింపబడితేనే దానిని సృష్టి అనాలి...

నిజానికి సృష్టే జరగలేదు...

ఈ సృష్టి అనాది.

ఈ సృష్టి సృష్టింపబడలేదు.

కాబట్టి దీనిని సృష్టి అనే పేరు తీసేసి

'సద్వస్తువు' అని నామకరణం చేసుకుంటే

ఈ గందరగోళం అంతా పోతుంది.

ప్రపంచం పరమాత్మస్వరూపం.

హరిమయముగాని ద్రవ్యము పరమాణువు లేదు...

ఈశావాస్యమిదం సర్వం...

జగత్తు మిథ్యా కాదు, కలా కాదు, అశాశ్వతమూ కాదు,

నాటకమూ కాదు...ఇవన్నీ నీవు ఆరోపించుకున్నవే.

బంగారంలో ఆభరణాన్ని ఆరోపించుకున్నట్టుగా...

త్రాడులో పామును ఆరోపించుకున్నట్టుగా...

స్రష్టకు భిన్నంగా సృష్టి లేదు...

సృష్టికి భిన్నంగా స్రష్టా లేదు...

స్రష్ట-సృష్టి ఒకే వస్తువు.

బంగారం నుంచి వేరు చేసి ఉత్త ఆభరాణాన్ని చూపగలమా?

ఆభరణం లేకుండా ఉత్త బంగారాన్ని చూపగలమేగానీ,

బంగారం లేకుండా ఉత్త ఆభరణాన్ని చూపలేం.

ఆ దృష్ట్యా ఆభరణాన్ని మిథ్య అన్నారేగానీ,

ఉపాదాన కారణం(బంగారం) శాశ్వతం.

కుండను నాశనం చేయగలమేగాని,

మట్టిని నాశనం చేయలేం

అలాగే స్రష్టకు వేరుగా సృష్టిని చూడలేము. .

అలాగే సృష్టికి వేఋగా స్రష్టనూ చూడలేము.

జగద్దర్శనమే భగవద్దర్శనం.

భగవద్దర్శనం అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు.

పేర్లు వల్లనే  ఈ గందరగోళం ఏర్పడింది.

ఈ నామాలు తీసేసి, ఈ రూపాలు తీసేసి ఉత్త 'ఉనికి'ని చూడు.

అదే భగవద్దర్శనం.

జగత్తును భగవత్స్వరూపంగా దర్శించే శక్తి

మనకు ధర్మాచరణ వలన కలుగుతుంది.

ధర్మాచరణమే గొప్ప తపస్సు ఏ యుగంలోనైనా.

ధర్మాచరణ ఎలాగు? అని మళ్లీ ప్రశ్న....

తద్ధి కౌశలం, యత్ బంధస్వభావాణ్యపి కర్మాణి

సమత్వ బుద్ధ్యా స్వభావాత్ నివర్తంతే -

-ఆదిశంకరులు

కర్మలు సహజంగా బంధాన్ని కలిగించే స్వభావం కలిగినవే ఐనప్పటికీ, సమత్వబుద్ధితో వాటిని ఆచరిస్తే, అవి వాటి స్వభావాన్ని వదిలిపెట్టి, బంధాన్ని విడిపిస్తాయి. కనుక సమత్వబుద్ధితో చేసే కర్మయే ధర్మాచరణ.

* * *

బాబు-బాబు అని నీవు అనుకుంటున్నావు...

నీవు బాబు కాదు...

నిద్రలో బాబు ఉండడు...

నిద్ర లేవగానే మీకు మొదటగా కనిపించే వ్యక్తి బాబు.

తిరిగి నిద్రపోయేవరకు బాబుతో తిరిగి తిరిగి...

అందరూ బాబు-బాబు అని పిలిచి పిలిచి...

"నేను" అనేది బాబుతో మమేకం అయిపోయి...

రెండూ ఒకటైపోయినట్టు అనిపిస్తుందిగాని....

రెండూ ఒకటి కాదు...

"నేను బాబు" అనడంలోనే...

నేను, బాబు ఇద్దరున్నామని చెప్పినట్టే...

పోలీసుడ్యూటీలో క్రొత్తగా జాయిన్ అయినవానికి...

107 నెంబరు ఇస్తారు...

మొదట్లో S.I ఆ నెంబరుతో పిలిచినప్పుడు...

పలుకడు...

అలా కొద్ది రోజులు పిలువగా, పిలువగా...

తాను ఆ నెంబరుతో మమేకం అయిపోతాడు...

అలా తాను బాబుతో మమేకం అయ్యి...

బాబు అయ్యాడేగానీ...

నిజానికి తాను బాబు కాదు...

'ఉనికి' ఒక్కటే...

పేర్లు అనేకం....

ఈ పేర్లు తీసేస్తే, అందరిలో ఉన్న "నేను" ఒక్కటే శేషిస్తుంది...

* * *

'ప్రేమ' అనే పదానికి నిర్వచనం తెలియకపోయినా,

శిశువు తల్లిప్రేమను అనుభవిస్తున్నట్టు

శాస్త్రపరిచయం లేకపోయినా,

సత్యానుభవాన్ని పొందటమే గురుసన్నిధిఫలం.

* * *

## 227. దేహాభిమానమే బ్రహ్మానుభవం, 'నేనెవడను' అనే విచారణ చేయవలసింది బ్రహ్మమే, జీవాత్మ కాదు

"ముక్తస్థితిని పొందాలంటే,

దేహాభిమానాన్ని వదలాలి" అని అంటుంటారు కదా!

మరి మీరేమో 'దేహాభిమానమే బ్రహ్మానుభవం' అంటున్నారు...! అని ఒకరు సందేహాన్ని వెలిబుచ్చారు

* * *

'నేను రామారావు అభిమానిని' అంటాను.

అంటే నేను వేఱు, రామారావు వేఱు  అనే కదా!

'నేను ఈ దేహాన్ని అభిమానిస్తున్నాను' అంటే,

"నేను" వేఱు, ఈ దేహం వేఱు అనే కదా!

దేహానికి నేను వేఱుగా ఉంటేనే,

నేను ఈ దేహాన్ని అభిమానించగలను.

దేహాభిమానం ఉండడం దోషమేమీ కాదు,

'నేను ఈ దేహాన్ని కాను' అనే సత్యాన్ని అది తెలుపుతోంది...

బ్రహ్మము తానెవరో  మరచిపోయేంతగా బాబు అనే బొమ్మను అభిమానించి, బొమ్మే తానైపోయింది. సుఖదుఃఖాలను అనుభవిస్తోంది.

మళ్లీ ఇప్పుడు బ్రహ్మమే  'నేనెవడను' అని   తనలో తాను విచారించుకొని,  తానెవరో తెలుసుకొని, జగత్తంతా తోలుబొమ్మలాటే అని తెలుసుకుని యధాస్థితికి చేరుకుంటుంది.

నేనెవడను? అనే సాధన చెప్పింది బ్రహ్మానికే;

ఈ బాబు అనే బొమ్మకు కాదు.

బొమ్మ జడం - దీనికసలు ఉనికే లేదు.

ఈ బాబు అనే బొమ్మకు బంధమూ లేదు, మోక్షమూ లేదు.

ఈ బాబు అనే బొమ్మకు సాధనా లేదు, సిద్ధీ లేదు.

మరి ఈ బొమ్మే కదా ఈ వ్యాసం వ్రాస్తోంది?

అని సందేహం రావొచ్చు.

కాదు...

బ్రహ్మమే వ్రాస్తోంది...

తానెవరో తాను తెలుసుకోవడంలో భాగంగానే జరుగుతుంది....ఈ పుస్తకపఠనం, వ్యాస రచనం, సద్గురు సహవాసం, ఆత్మవిచారం...

వాహనంలో వాహకుడు ఉన్నప్పుడు మాత్రమే

వాహనంలో చైతన్యం ఉన్నట్టు,

దేహంలో బ్రహ్మం ఉన్నప్పుడు మాత్రమే ఈ జడ దేహంలో చైతన్యం కనిపిస్తుంది.

ఆయన కదలికే మన కదలికగా కనబడుతుంది.

ఆయన పలుకే మన పలుకుగా ఉంటుంది.

అందువల్లనే రమణులు ఈ దేహాన్ని చిత్-జడ గ్రంధి అన్నారు.

గ్రంధి అంటే ముడి.

ముడిలో  చిత్-జడముల (జీవ-ఆత్మల) రెంటి స్పర్శా ఉంటుంది.

పూర్తిగా చిత్తు అయిపోయినా కదలిక ఉండదు.

పూర్తిగా జడం అయిపోయినా కదలిక ఉండదు.

చిత్-జడముల కలయిక ఈ దేహం.

దేహం వల్లనే సంసారం.

సంసారం వల్లనే దుఃఖం.

దుఃఖాన్ని మాపేది ఆత్మవిచారం.

సంసారంలో-

నేను-నాది విడివిడిగా ఉంటాయి.

స్వరూపంలో-

నేను-నాది ఏకమై ఉంటాయి.

పూర్తి చిత్తుకూ సాధన అవసరం లేదు.

పూర్తి జడానికీ(శవానికీ) సాధన అవసరం ఉండదు.

చిజ్జడగ్రంథికే లేదా జీవాత్మకే అన్నీను...

బొమ్మలాటలో పడి, తానెవరో మరచిపోయిన బ్రహ్మమే చిజ్జడగ్రంథి(జీవాత్మ).

నిజానికి చదరంగంలో రెండువైపులా తానే ఉండి, బ్రహ్మము ఆడే ఆటే ప్రపంచం.

ఓటమీ తనదే, గెలుపూ తనదే.

ఆట అనేది మరిస్తే సుఖదుఃఖాలు రెండూ దుఃఖమే.

ఆట అనే గుర్తుంటే సుఖదుఃఖాలు రెండూ సుఖమే.

మరపే బంధం, ఎరుకే మోక్షం.

బ్రహ్మానికి; మనకు కాదు.

మనకసలు ఉనికే లేదు.

అనే తెలివి కూడా బ్రహ్మము యొక్క స్పర్శ వలన కలుగుతోంది...

* * *

బ్రహ్మమే దేహాన్ని అభిమానించి, దానికి తోడునీడగా ఉండి నడిపిస్తోంది, డ్రైవరు బస్సును నడిపిస్తున్నట్లుగా...

"అదిగో బస్సు వస్తోంది..." అంటామేగాని,

అదిగో డ్రైవరు వస్తున్నాడు...అని ఎవరూ అనరు.

అలా 'బాబు వస్తున్నాడు' అంటారేగానీ, బాబు లోపలుండి నడిపే బ్రహ్మాన్ని ఎవడూ గుర్తించడు.

అంటే వాహనానికి ప్రాముఖ్యతనిచ్చి,

వాహకుణ్ణి మరిచిపోతున్నాం.

* * *

'నేను బాబు' అని అనేది బ్రహ్మమే.

'నేను బ్రహ్మమును' అని అనేది బ్రహ్మమే.

బ్రహ్మమునకు-

నేను బాబు అని అనుకుని బాబు అయ్యే శక్తీ ఉంది.

అలాగే అహంబ్రహ్మాస్మి  - నేను బ్రహ్మమును అనుకుని తిరిగి బ్రహ్మమయ్యే శక్తీ ఉంది.

బ్రహ్మము సర్వశక్తిమంతము - చైతన్యము.

బాబు అస్వతంత్రుడు - జడము.

* * *

కాబట్టి-

బాబు బ్రహ్మము కావడానికి చేసే సాధన కంటే,

బ్రహ్మమే బాబు అయివున్నది అనే అవగాహన సిద్ధినిస్తుంది.

* * *